

మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పాడేరు : ఉపాధి హామీ పనిచేస్తూ పని ప్రదేశంలోనే గుండెపోటుతో మరణించిన కొర్ర గాసి కుటుంబానికి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలోని నిబంధన ప్రకారం ప్రభుత్వం సరఫరా చేసిన నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, మండల కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం చింతపల్లి మండలం చెరుకుంపాకాలు గ్రామస్తుడైన కొర్ర గాసి ఉపాధి పని ప్రదేశంలో గుండెపోటుతో మరణించగా, విషయం తెలుసుకున్న ఆదివాసీగిరిజన సంఘం నేతలు గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో చనిపోతే, కూలీల కుటుంబానికి నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం, జాప్యంపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే బాధిత కుటుంబానికి ఉపాధి పరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మృతుని భార్య నీలమ్మ, కుమారులు సుబ్బారావు, లక్ష్మణరావు కుమార్తెలు బుంద, గంగమ్మ, చంద్రమ్మ, కుటుంబ సభ్యులు బలరాం, రమణ అప్పన్న పాల్గొన్నారు.

అంగన్వాడీల 36 గంటల ధర్నా విజయవంతం

- పాడేరులో భారీ ర్యాలీ, మానవహారం
- రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల ముట్టడి



పాడేరు అంబేడ్కర్ జంక్షన్‌లో అంగన్వాడీల మానవహారం



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటిడిఎల వద్ద అంగన్వాడీ వర్కర్లు నిర్వహించిన 36 గంటల ధర్నా విజయవంతమైంది. మారుమూల కొండకోనల్లో ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రం నుంచి వర్కర్లు, హెల్పర్లు ఆందోళనకు కదిలి వచ్చి తమ ఐక్యతను, పోరాటస్ఫూర్తిని ప్రదర్శించారు. జోరువానను సైతం లెక్కచేయకుండా అంగన్వాడీ వర్కర్లు రాత్రంతా ధర్నా శిబిరంలోనే తలదాచు కున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో రోజంతా తాము విధి నిర్వహణలో భాగంగా శ్రమించే తామంతా, సమస్యల పరిష్కారానికి ఇలా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో నిద్రాహారాలు మాని పోరాటం చేయాల్సిన దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది అంగన్వాడీలు ఒడిలో చిన్నారులతోనే గంటలసేపు ధర్నాలో కూర్చున్నారు.

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో రెండవ రోజు మంగళవారం ఐటిడిఎ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు భారీ ర్యాలీ నిర్వహించి, రెండు గంటల సేపు అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి బైఠాయించారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కె. భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. తమ సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపడంపై నిరసనతో నినాదాలు చేశారు. అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కేంద్రబడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. వందలాదిగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీల ఐటిడిఎ ముట్టడి

రంపచోడవరం : ఐసిడిఎస్‌కు నిధులు పెంచి బలోపేతం చేయాలని,

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) కేంద్ర కమిటీ పిలుపు మేరకు రంపచోడవరం ఐటిడిఎను అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం ముట్టడించారు. 36 గంటల ధర్నా ముగింపు సందర్భంగా అంగన్వాడీలు ఐటిడిఎను ముట్టడించి ఐటిడిఎ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను ఎత్తేసే కుట్ర చేస్తున్నాయి తప్ప, దానిని బలోపేతం చేసే చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. మాట తప్పను మడమ తిప్పనన్న ముఖ్యమంత్రి ఎన్నికల హామీలను అమలు చేయడం లేదన్నారు. ధర్నాకు మద్దతు తెలియజేసిన రంప చోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను టిడిపి అధినేత చంద్రబాబు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వద్దకి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ తెలంగాణలో అంగన్వాడీలకు ఇచ్చే వేతనాల కంటే అదనంగా ఇస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు విల్సన్, సూరిబాబు, వెంగళరావు అంగన్వాడీల ధర్నాకు మద్దతు తెలియజేశారు. అనంతరం ధర్నా వద్దకు వచ్చిన ఐటిడిఎ ఎపిఒ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శాంతిరాజు, బాపన్న దొర, గిరిజన సంఘం నాయకులు సిరిమల్లిరెడ్డి, శ్రీను, సాగర్, అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, రామలక్ష్మి, రాణి, వెంకటలక్ష్మి, రత్నకుమారి, సింగారమ్మ, ప్రసూన, జి.బేబీరాణి, చిన్ని కుమారి, నాగదేవి పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు ఐటిడిఎ వద్ద రెండో రోజు ధర్నాను ఐద్వా రాష్ట్ర నాయకులు రమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్‌కి నిధులు పెంచాలని, 2017 నుండి టీఏ బిల్లులు చెల్లించాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీలను సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పోడియం లక్ష్మణ్, బీరబోయిన దిలీప్, వ్యకాస నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు సున్నం రంగమ్మ, ప్రాజెక్టు లీడర్లు వెంకటరమణ, జయ, కామేశ్వరి, దుర్గ, రాజేశ్వరి, విజయ, అన్నపూర్ణ, ముత్తమ్మ, సూర్య కుమారి పాల్గొన్నారు.



రంపచోడవరం ఐటిడిఎ ముట్టడించిన అంగన్వాడీలు



చింతూరులో దీక్షల్లో పాల్గొన్న అంగన్వాడీలు

అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స



మాట్లాడుతున్న .అప్పలనర్స

పాడేరు : ఆరోగ్యవంతమైన సమాజం కోసం అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనర్స డిమాండ్ చేశారు. పాడేరులో అంగన్వాడీల 36 గంటలు మహాధర్నా ముగింపు సందర్భంగా అంబేద్కర్ జంక్షన్‌లో నిర్వహించిన భారీ బహిరంగసభలో మాట్లాడుతూ, పాదయాత్రలోనూ, ఎన్నికలకు ముందు ఓట్ల కోసం సిఎం జగన్ అంగన్వాడీలకు పలుహామీలిచ్చి వాటిని అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు చెల్లిస్తామని మాటిచ్చి తప్పారన్నారు. నూతన విద్యావిధానంలో అంగన్వాడీల్లో మూడో తరగతి వరకు విద్యాబోధనకు చర్యలు చేపడతామని వాగ్దానమిచ్చి, ప్రాథమిక పాఠశాలను రద్దు చేశారన్నారు. రేషనలైజేషన్ పేరుతో ఉన్న ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేశారన్నారు.యాప్‌ల పేరుతో అంగన్వాడీలపై పనిభారం పెంచారే తప్ప, వేతనంపెంపు, ఉద్యోగ భద్రతకు చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. రూ.26వేలు కనీస వేతనం, గ్రాట్యూటీ అమలు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పును కూడా బేఖాతరు చేసి, న్యాయవ్యవస్థను అగౌరవ పరిచారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులంటూ, భద్రత కల్పించకపోగా, రాష్ట్ర ప్రభుత్వపథకాలను కూడా దక్కనీయకుండా చేశారని విమర్శించారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, జిఒ3 రద్దుతో ఉద్యోగ నియామకాల్లో స్థానిక గిరిజన యువతకు అన్యాయం జరిగినా పట్టించుకోలేదన్నారు. అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, అంగన్వాడీ సమస్యలపై ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు నోరు మెదపకపోవడంపై ధ్వజమెత్తారు. గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.హైమవతి మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌బిఐ పోతురాజు, భగత్‌రామ్, సహ కార్యదర్శి కిల్లో మొసాయి, సన్నిబాబు, శంకరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మంగమ్మ, గిరిజన సంఘం నాయకులు ఎల్ సుందరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లానేతలు కళావతి, కొండమ్మ, వెంకటలక్ష్మి, పెంటమ్మ పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణే లక్ష్యం

- ప్రతి చిన్నారికి విధిగా వ్యాక్సినేషన్ వేయాలి
- బర్త్ వెయిటింగ్ హాల్స్ సక్రమంగా వినియోగించాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : పుట్టిన ప్రతి చిన్నారికీ విధిగా వ్యాక్సినేషన్ వేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో శిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సేవలందించాలని స్పష్టం చేసారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలోని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. శనివారాలలో వ్యాక్సినేషన్ ప్రక్రియ నిర్వహించాలన్నారు. పిహెచ్‌సిలలో వ్యాక్సిన్ కొరత ఉంటే ఐటిడిఎ పిఒల దృష్టికి తేవాలన్నారు. పిహెచ్‌సిలను . ఐటిడిఎ పిఒలు తనిఖీ చేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో శిశు మరణాల వ్యాక్సినేషన్ రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో శిశు మరణాల గణాంకాలు వ్యత్యాసం లేకుండా ఒకే విధంగా ఉండాలన్నారు.

ఎఎన్ఎం పోర్టలును వైద్యాధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. గర్భవతులకు బ్యాంకు ఖాతాలు తెరవడానికి ఎఎన్ఎంలు, ఆశాలు బ్యాంకులను సంప్రదించి బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలన్నారు. జననీ సురక్షా యోజన, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహకాలు గిరిజనులకు ఆసరాగా ఉంటుందన్నారు. గిరి శిఖర గ్రామాల గర్భవతులను బర్త్ వెయిటింగ్ హాల్సుకు తరలించి సుఖ ప్రసవం జరిగేవిధంగా. వైద్య సేవలు అందించాలని సూచించారు. ఏడువేల డెంగీ కిట్లును ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఏరియా ఆసుపత్రులకు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తామన్నారు.డెంగీ, మలేరియా కేసులపై వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.సమావేశంలో ఐటిడిఏ పిఒలు వి.అభిషేక్, సూరజ్. గనోరే , జిల్లా వైద్యాధికారి డాక్టర్ జమాల్ బాషా, జిల్లా క్షయనివారణాధికారి డాక్టర్ టి. విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.

భూముల రీసర్వే లక్ష్యాలు సాధించండి :కలెక్టర్

పాడేరు : భూముల రీసర్వే లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని తాహాశీల్దారులు, సర్వే అధికారులతో రీ సర్వే పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా పూర్తి చేసిన సర్వేపై సమీక్షించారు. రెండు వందల గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. మరో రెండు వందల గ్రామాలలో సర్వే చేయవలసి ఉందని లక్ష్యాలను నిర్దేశించారు. నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం రీసర్వే జరగాలన్నారు. 9(2) నోటీసులు జారీ చేసి రైతుల నుండి అభ్యంతరాలు స్వీకరించాలని స్పష్టం చేసారు. మ్యుటేషన్లను పూర్తి చేయాలని చెప్పారు. ఈనెల 13 వ తేదీ నుండి 19 వతేదీ వరకు ఎన్ని గ్రామాల్లో సర్వే చేస్తారని అడిగి తెలుసు కున్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాసు, పాడేరు, రంపచోడవం డివిజన్లలోని తహాశీల్దారులు పాల్గొన్నారు.



విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విలేజ్ క్లినిక్‌లతో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి- కొయ్యూరు

వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందనుందని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బంగారం పేట, అంతాడలో వైయస్సార్ విలేజ్ క్లినిక్లను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2000 మంది జనాభా ఉన్న ప్రతి గ్రామంలోనూ ఒక సచివాలయం, వైయస్సార్ విలేజ్ క్లినిక్, వైయస్సార్ రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలు వైద్యం కోసం దూరంగా వెళ్లాల్సిన అవసరం ఉండకుండా వాళ్లకు సమీపంలోనే వైద్య సేవలు అందనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చందు, పెంటమ్మ , జెడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్, వైసిపి నాయకులు జల్లి బాబులు, నాగమణి , బండి సుధాకర్, బిడిజిన అప్పారావు, ముసలి నాయుడు, గాడి సత్యనారాయణ, రీమల గంగాధరం, నేలపు సూరిబాబు, శేఖర్, వనం బాబు, ఉల్లి రామ్మూర్తి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మంగళవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్ మాట్లాడుతూ చింతూరు, మోతుగూడెం, ఏడుగురాళ్లపల్లి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న వర్కర్లకు పెండింగ్ వేతనం చెల్లించాలని, 010 జీవో నెంబర్‌ను అమలు చేయాలని, గ్రీన్ అంబాసిటర్లకు ఐడి కార్డులు ఇవ్వాలని కోరారు. ఇటీవల విజయనగరం జిల్లా మామిడి గౌరు గ్రామపంచాయతీ వర్కరు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోవడం జరిగిందని, ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్‌లు రాములమ్మ, త్రిమూర్తి, నాగమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న పంచాయతీ కార్మికులు

వాలంటీర్లకు పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-కొయ్యూరు

కేవలం రూ.5వేలు వేతనం తీసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక భూమిక పోషిస్తున్న వాలంటీర్లు సమాచారాన్ని సంఘవిద్రోహశక్తులకు చేరవేస్తున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. వాలంటీర్లు సంఘవిద్రోహక శక్తులకు సమాచారం ఇవ్వడం వల్లే హ్యూమన్ ట్రాఫికింగ్, ఉమెన్ ట్రాఫికింగ్ జరుగుతుందని పవన్ చేసిన వ్యాఖ్యలపై భాగ్యలక్ష్మి మండిపడ్డారు. తక్షణమే వాలంటీర్లకు భేషరత్తుగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. మంగళవారం కొయ్యూరులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంలో పెన్షన్ రావాలంటే పంచాయతీ కార్యదర్శి దగ్గరికి వెళ్లాల్సి వచ్చేదని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేదని, ఆ సేవలన్నింటిని నేరుగా వాలంటీర్లే అందిస్తున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో, పోలవరం నిర్వాసిత ప్రాంతాల్లో వరద సంభవించినప్పుడు ఇలా ఆపద వచ్చిన ప్రతిసారీ వాలంటీర్లే సేవలు అందిస్తున్నారని తెలిపారు. 2021 గణాంకాల ప్రకారం మహారాష్ట్రలో 37,788, మధ్యప్రదేశ్లో 3560 పైబడి, తెలంగాణలో 13000 మిస్సింగ్ కేసులు నమోదయాయని, మరి వాటి వెనక ఏ వాలంటీరు వ్యవస్థ పనిచేస్తుందో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. దేశమంతటా ప్రశంసలు అందుకుంటున్న వాలంటీరు వ్యవస్థను అపహాస్యం చేసేలా పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్, స్థానిక సర్పంచ్ చందు, పెంటమ్మ, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, బండి సుధాకర్, డౌనూరు ఎంపీటీసీ బిడిజిన అప్పారావు, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు ముసలి నాయుడు, వైసిపి నాయకులు గాడి సత్యనారాయణ, రీమల గంగాధరం, నీలపు సూరిబాబు, శేఖర్, వనం బాబు, ఉల్లి రామ్మూర్తి పాల్గొన్నారు.

దారాలమ్మ ఆలయానికి పెరుగుతున్న భక్తుల తాకిడి

పార్కు స్థలం లేకపోవడంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ అమ్మవారి ఆలయానికి భక్తులు తాకిడి రోజు రోజు పెరుగుతోంది. ఇందుకు అనుగుణంగా వాహనాలకు పార్కు స్థలం లేకపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అత్యధిక సంఖ్యలో భక్తులు దారాలమ్మ అమ్మవారిని సందర్శించి మొక్కలు తీర్చుకునేందుకు నిత్యం వస్తున్నారు. ఈ క్రమంలోనే భక్తులు ప్రత్యేక వాహనాల్లో మంగళవారం అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ధారాల మా అమ్మవారి పై భాగంలో ఉన్న ప్రమాద మలుపు నుంచి కింది భాగంలో ఉన్న ప్రమాదం మలుపు వరకు రోడ్డుకు ఇరువైపులా అత్యధిక సంఖ్యలో వాహనాలు నిలిపివేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదే రహదారి గుండా ఆంధ్ర, ఒడిశా, తెలంగాణ తదితర ప్రాంతాలకు బస్ సర్వీసులు ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలు ప్రధాన రహదారిపై నిలిపివేయడంతో వాహన చోదకులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. అమ్మవారు ఆలయం నుంచి వచ్చే పోయే వాహనాలు వెళ్లేందుకు రహదారి కూడా వెడల్పుగా లేకపోవడంతో మరింత సమస్యగా తయారైంది. దారాలమ్మ అమ్మవారి సందర్శనకి వచ్చిన భక్తుల వాహనాలకు నిలిపివేయడానికి పార్కింగ్ స్థలం దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

కాలం చెల్లిన బస్సులతో తప్పని కష్టాలు

ప్రజాశక్తి -సీలేరు

కాలం చెల్లిని బస్సులతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. జీకే వీధి మండలం దారకొండ వద్ద సోమవారం రాత్రి 11 గంటలకు మధురవాడ డిపో చెందిన ఆర్టీసీ నైట్ బస్సు సాంకేతిక లోపాలు తలెత్తి అర్ధాంతరంగా నిలిచిపోయింది. భద్రాచలంలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు బయలు దేరిన ఈ బస్సు సీలేరు దాటిన తరువాత దారకొండ వెళ్లేసరికి డబల్ గేర్ పడి గేర్ బాక్స్ మరమ్మతులకు గురి కావడంతో బస్సు ముందుకి, వెనక్కి నడవని పరిస్థితి నెలకొంది. దీంతో గత్యంతరం లేక డ్రైవరు బస్సును నిలుపుదల చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వెంటనే డ్రైవర్ డిపో మేనేజర్‌కి సమాచారం ఇవ్వడంతో ప్రయాణికులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సీలేరులో నైట్ హాల్ట్‌గా ఉన్న బస్సులో 36 మంది ప్రయాణికులను విశాఖ తరలించారు. ఒకవేళ బస్సు దట్టమైన అడవిలో మరమ్మతులకు గురై ఉంటే తమ పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు కాలం చెల్లిన బస్సుల్ని వేయడం సరికాదని, కొత్త బస్సులు ఏర్పాటు చేసి ప్రయాణికులు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు.



రాఘవయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం సీనియర్ నాయకులు రాఘవయ్య మృతి

ప్రజాశక్తి-కూనవరం

సిపిఎంలో 40ఏళ్లుగా ఎంతో క్రియాశీలకంగా పని చేసి, పార్టీ అభివృద్ధికి కృషి చేసిన మండలంలోని కరకగూడెం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కరక రాఘవయ్య సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహన్ని సీపీఎం నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమరం దామోదర్ మాట్లాడుతూ ఎన్నో ఆటు పోట్లు ఎదురైనా తుది శ్వాస వరకు పార్టీలోనే కొనసాగారని, అటువంటి నాయకుడు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. రాఘవయ్య కుటుంబానికి సీపీఎం ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. రాఘవయ్య స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, మడకం నాగమణి, ఆవుల ఉపేంద్ర, ఆవుల మురళి, శ్యామల కృష్ణ, కర్నాటి శ్రీనివాసరావు, నస్కురి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పాదయాత్ర సందర్భంగా వి.శ్రీనివాసరావుతో రాఘవయ్య (ఫైల్‌ఫొటో)

జగనన్న సురక్షతో లబ్ధి

ప్రజాశక్తి - రంపచోడవరం :

జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య అన్నారు. రంపచోడవరం గ్రామ సచివాలయం - 1లో మంగళవారం జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 249 కుల, 322 ఆదాయ, 1 వివాహ, 1 కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బిఎస్.శాస్త్రి, ఎంపిపి బంధం శ్రీదేవి, జెడ్‌పిటిసి పండా వెంకట లక్ష్మి, వైస్ ఎంపిపి కె.బాలకృష్ణ, జగనన్న సురక్ష డివిజనల్ కోఆర్డినేటర్ పండా రామకృష్ణ, తహసీల్దార్ పివివిఎస్‌జె కుమార్, వార్డు సభ్యులు కె.వెంకటరావు, ఎం.రామలక్ష్మి, సిహెచ్ శ్యామల, జి.రమణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ పి.కాంతం, పంచాయితీ కార్యదర్శి ఎన్.రమేష్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

సంక్షేమ హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లాలో గిరిజన ఆశ్రమ, గురుకుల పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ పూర్తి స్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో మెనూ అమలుకాక విద్యార్థులు అర్థాకలితో అలమటిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో మెనూ అమలుపై ప్రత్యక్ష పర్యవేక్షణతో పాటు విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకుని చక్కదిద్దే చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో హాస్టల్ నిద్ర పేరుతో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు గురుకులాలు, ఆశ్రమాల హాస్టళ్లకు వెళితే వార్డెన్లు గేట్లకు తాళాలు వేసి, లోపలకు రానీయకుండా, విద్యార్థులతో మాట్లాడనీయకుండా అడ్డుకున్నారన్నారు. హాస్టళ్లలో మెనూ అమలు కాకపోవడం, ఇతర సమస్యలు బహిర్గతం కాకుండా ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పూనుకున్నారని, దీనిపై గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ చొరవ చూపి, ప్రత్యేక పర్యవేక్షణతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే తామే ఆశ్రమాలను వెలికి తీసి, ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న హాస్టల్ కమిటీ చైర్మన్

హాస్టల్‌లో అమలు కాని మెనూ

కలెక్టర్, పిఒకు ఫిర్యాదు : విద్యాకమిటీ చైర్మన్

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతిగృహంలో భోజన మెనూ అమలు చేయని వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఆ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజన పదార్థాలు పెట్టడం లేదన్నారు. రోజూవారీ పెట్టాల్సిన చట్నీ, పాలు, పెరుగు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ ఇవ్వడం లేదన్నారు. మధ్యాహ్నం మిగిలిన అన్నం సాయంత్రం వండిన అన్నంలో కలిపి పెడుతున్నట్లు విద్యార్థులు తన దృష్టికి తెచ్చారన్నారు. దీనిపై కలెక్టర్, ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు కలర్ పెన్సిళ్లు పంపిణీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని కించమండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని142 మంది విద్యార్థులకు విన్సెంట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు హెచ్‌బి జాన్ విన్సెంట్ కలర్, మామూలు పెన్సిల్స్, ఎరైజర్లు, షార్పెనర్స్, తన సొంత నిధులతో సమకూర్చి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమికస్థాయి నుంచి చదువు మీద దృష్టి పెట్టి బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.సూరిబాబు ,ఉపాధ్యాయులు బొబ్బిలి, అప్పలరాజు, వల్లి, నరసయ్య పాల్గొన్నారు.



పెన్సిల్స్ ఇస్తున్న జాన్ విన్సెంట్

ఉచితమని చెబుతూనే....

పేదలపై రూ.7.27 కోట్ల భారం

- రూ.40కు యూనిఫాం దుస్తులు కుట్టేదెవరు?
- ధర నిర్ణయంపై తల్లిదండ్రుల అసంతృప్తి
- మూడేళ్లుగా పైసా కుట్టుకూలీ ఇవ్వని వైనం
- విద్యాకానుక అమలుపై పలువురి పెదవి విరుపు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇచ్చి, వాటిని కుట్టించేందుకు అతి తక్కువ ధర నిర్ణయించి, కుట్టించే బాధ్యతను తల్లిదండ్రులకు అప్పగించిన సర్కారు తీరుపైపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిరిగిన చొక్కా కాలర్ కుట్టించుకొనడానికి సరిపడని సొమ్ము రూ.40తో ఒక జత యూనిఫాం దుస్తులు ఎలా కుట్టించాలో, ఏ దర్జీ కుడతారో ప్రభుత్వమే చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ఉచితమని చెబుతూనే తల్లిదండ్రులపై ఇలా భారం మోపడం తగదంటున్నారు.

జగనన్న విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు పంపిణీ చేస్తున్న యూనిఫాం దుస్తుల గుడ్డఇచ్చి, తల్లిదండ్రులే కుట్టించుకోవాలన్న ప్రభుత్వతీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. అతితక్కువ కుట్టు కూలి ధరను నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం, ఆ నగదును సక్రమంగా విడుదల చేయడం లేదంటున్నారు.. ఇచ్చేదే అరకొర, అందులోనూ రెండేళ్ల నుంచి అందకపోవడంతో ఆ భారం తల్లిదండ్రులపై పడుతోంది. కుట్టు కూలి డబ్బులు తమ ఖాతాలకు ఎప్పుడు జమవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల్ని ప్రశ్నిస్తున్నారు. వారికి సమాధానం చెప్పలేక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

అరకొర కుట్టు కూలీ.. మూడేళ్లుగా ఇవ్వని వైనం

చదువులమ్మ ఒడిలో అందరూ సమానమేనని చెప్పేందుకు యూనిఫారం దుస్తులు అందజేసేందుకు నిర్ణయించిన ప్రభుత్వం, జగనన్న విద్యాకానుక ఒక్కో విద్యార్థికి మూడు జతలకు గుడ్డ పంపిణీ చేస్తోంది. కుట్టుకూలీ ప్రభుత్వం ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు 6 నుంచి 8వ తరగతి వరకు జతకు రూ.40 చొప్పున మూడుజతలకు రూ.120, అలాగే 9, 10 తరగతుల విద్యార్థులకు జతకు రూ.80 చొప్పున మూడు జతలకు రూ.240 కుట్టు కూలి నిర్ణయించి, ఆ మొత్తాన్ని తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని, వారే సొంతంగా కుట్టించుకోవాలని ప్రభుత్వం ప్రకటించించి.

అయితే బయట మార్కెట్‌లో కుట్టుకూలి రేట్లపై ఆరా తీస్తే 8వ తరగతి వయస్సున్న విద్యార్థులకు జతకు రూ.300 నుంచి రూ.400 చొప్పున రూ.1200 ఖర్చవుతోంది.అలాగే 9,10 తరగతుల విద్యార్థులకు ఫ్యాంటు, షర్టు జత కుట్టుకూలీ రూ.400 నుంచి రూ.500 వరకు గ్రామీణ ప్రాంతాల్లో తీసుకుంటుంటే, ప్రభుత్వం ఇస్తామన్నది మాత్రం ఒక్కో జతకు రూ.120 చొప్పున రూ.360 మాత్రమే. తల్లుల ఖాతాలకు కుట్టుకూలీ జమచేస్తామన్న ప్రభుత్వం, మూడేళ్లుగా పైసా ఇవ్వలేదని వారు వాపోతున్నారు.

తల్లిదండ్రులపై భారీ భారం

అల్లూరి జిల్లా వరకు పరిశీలిస్తే 6 నుంచి 8వ తరగతి వరకు 50,251 మంది (6వ తరగతి 18177, 7వ తరగతి 17074, 8వ తరగతి 15000) విద్యార్థులు ఉండగా, వారి ఏకరూప దుస్తుల కుట్టుకూలి జతకు రూ.40 చొప్పున రూ.60,30,120 మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక జత ఏకరూప దుస్తులు కుట్టేందుకు దర్జీలు సగటున రూ.300 తీసుకుంటుండగా, మూడు జతలకు రూ.900 అవుతోంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 6, 7, 8వ తరగతి విద్యార్థులకు రూ.4,52,25,900 ఖర్చవుతుంది. ప్రభుత్వం ఇచ్చే కుట్టుకూలీ సొమ్ము పోను తల్లిదండ్రులపై రూ.3,91,95,780 భారం పడుతోంది.అలాగే జిల్లాలో 9, 10వ తరగతి విద్యార్థులు 26,611 మంది (9వ తరగతి 13912 మంది, పదో తరగతి 12699 మంది) ఉండగా, ప్రభుత్వం ఒక్కో జతకు రూ.80 చొప్పున రూ.63,86,640 మాత్రమే చెల్లిస్తుంది. బయట మార్కెట్ ధర ప్రకారం ఒక్కో జతకు రూ.500 కుట్టు కూలి ఖర్చవుతుండగా మూడు జతలకు రూ.1500 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఈ లెక్కన 9, 10 తరగతుల మొత్తం విద్యార్థులకు రూ.3,99,16,500 ఖర్చవుతోంది. ప్రభుత్వం ఇస్తామన్న కుట్టుకూలిఈ సొమ్ము ఇప్పటివరకు ఇవ్వకపోగా, ఒకవేళ ఇచ్చినా తల్లిదండ్రులపై అదనంగా రూ.3,35,29,860 భారం పడుతోంది. మొత్తంగా ఒక్క అల్లూరిజిల్లాలోనే విద్యార్థులకు యూనిఫాం కుట్టుకూలీ కింద రూ.7.27కోట్ల భారం వేస్తున్న ప్రభుత్వం తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి, గుడ్డ ముక్కలు విద్యార్థుల ముఖాన కొట్టి, అంతా తామే ఇచ్చేస్తున్నామన్నట్లు ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం , అధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ఉపాధ్యాయుల గైర్హాజరుతో తోడుబంద పాఠశాలకు తాళం

- -చూసీచూడనట్లు వ్యవహరిస్తోన్న అధికారులు
- -వారంలో రెండుమూడు రోజులే తరగతులు
- - అమలు కాని మధ్యాహ్న భోజనం
- -ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీ తోడుబంద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తరచూ విధులకు డుమ్మాకొడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. 20మంది విద్యార్థులున్న పాఠశాలకు ప్రతిరోజూ పిల్లలకు పాఠశాలకు రావడం, తాళాలు వేసి ఉండడంతో కొద్దిసేపు వేచిచూసి వెనుదిరుగుతున్నారని అంటున్నారు. పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు తరచూ డుమ్మా కొడుతున్నారని, దీంతో తమ పిల్లల చదువు, భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు రాకపోవడంతో పాఠశాలలో మధ్యాహ్న భోజనం కూడా అమలు కావడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల ప్రారంభంలో రెండు రోజులు మాత్రమే ఉపాధ్యాయులు విధులకు వచ్చారని తరువాత రాలేదని అంటున్నారు. దీనిపై ఎంఇఒగానీ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంగానీ పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం, మండల విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిండం తమ పాఠశాల దుస్థితికి కారణమని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, జిల్లావిద్యాశాఖాధికారులు దృష్టి పెట్టి, తోడుబంద పాఠశాలను చక్కదిద్దాలని, గైర్హాజరైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తాళాలు వేసి ఉన్న తోడుబంద పాఠశాల

నేరాలు ఘోరాలు

ఘాట్ రోడ్డులో ప్రమాదం : బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి పాడేరు: పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మ పాదాలు సమీపంలో వ్యూపాయింట్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సును బైక్ ఢీొట్టిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామానికి చెందిన సతీష్ అనే యువకుడు తన స్నేహితులతో కలిసి బైక్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. బస్సును ఢీకొనడంతో బైక్ డ్రైవింగ్ చేస్తున్న సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు స్థానిక ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నూకాంబిక దేవాలయం హుండీ చోరీ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని లింగంపేట నూకాంబిక దేవాలయంలో హుండీ చోరీ జరిగింది. వడ్డాదికి చెందిన వ్యక్తి లింగంపేట పంచాయతీ రామచంద్రాపురం గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చి మంగళవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అతన్ని పట్టుకొని ఆరా తీయగా తానే హుండీలో ఉన్న డబ్బును తీసికున్నట్లు ఒప్పుకోవడంతో స్థానికులు పోలీసులకు అప్పగించారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

బాలుడి మృతిపై కేసు నమోదు


ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని సిహెచ్‌బి అగ్రహారం గ్రామానికి చెందిన పడాల రాజారావు తన కుమారుడు కిరణ్ (16) వ్యాన్లో ప్రయాణిస్తుండగా కిందపడి మతి చెందినట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం తన కుమారుడు కిరణ్ గొడిచెర్ల కొత్తూరు నుంచి గొడిచెర్ల వచ్చేందుకు ఒక మినీ వ్యాన్ తొట్టిలో ఎక్కాడని, గొడిచెర్ల గ్రామ సమీపాన రైలు వంతెన కింద నుంచి వ్యాన్ వచ్చినప్పుడు వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో రైల్వేవంతెనకు కిరణ్ తల తగలడంతో తీవ్రగాయాలతో తొట్టెలో పడిపోయినట్టు తెలిపారు. వెంటనే వ్యాన్ డ్రైవర్ గొడిచెర్ల ఆస్పత్రికి తరలించగా, ప్రథమచికిత్స అనంతరం నక్కపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే కిరణ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శిరీష తెలిపారు

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సచివాలయ సెక్రటరీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి 79వ వార్డు ప్రశాంతినగర్ సచివాలయ సెక్రటరీ రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ప్రశాంతినగర్ సచివాలయంలో తమ్మడాల భాస్కర్ సెక్రటరీగా పని చేస్తున్నారు. గత కొంతకాలంగా ఇతను అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందటంతో ఎసిబి అధికారులు నిఘా పెట్టారు. అగనంపూడి సచివాలయంలో తండ్రి ఇంటిని ఇద్దరు అన్నదమ్ములు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అన్నదమ్ములకు ఇంటి పన్ను వేరు చేసేందుకు భాస్కర్ రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ఎసిబిని ఆశ్రయించారు. ఎసిబి అధికారుల సూచనల మేరకు మంగళవారం సాయంత్రం బాధితులు డబ్బులు పట్టుకొని సచివాలయానికి వెళ్లారు. కార్యాలయంలోనే బాధితుల నుంచి సెక్రటరీ భాస్కర్ లంచం తీసుకుంటుండగా ఎసిబి సిఐ కిశోర్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు.

అప్పన్నను దర్శించుకున్న పార్లమెంటరీ అధికార భాష సబ్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను మంగళవారం పార్లమెంటరీ అధికార భాష కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఆలయ ఎఇఒ భ్రమరాంబ, ఆలయ పర్యవేక్షకులు సునీల్ కుమార్ సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని అందించారు.



చిత్ర బృందంతో సాయిధరమ్ తేజ్

విశాఖలో సాయిధరమ్ తేజ్ సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆర్‌టి టీమ్ వర్క్స్, గోల్డెన్ మీడియా బ్యానర్స్‌పై కల్యాణ్ సంతోష్ నూతన దర్శకత్వంలో వైవా హర్ష, దివ్య శ్రీపాద జంటగా నటించిన సుందరం మాస్టర్ సినిమా టీజర్‌ను హీరో సాయి ధరమ్ తేజ్ మంగళవారం సిరిపురంలోగల విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరం మాస్టర్ అందరినీ కడుపుబ్బా నవ్విస్తాడని అన్నారు. తనకు ఇష్టమైన హీరో రవితేజ స్థాపించిన ఆర్‌టి టెక్నాలజీ సంస్థ ద్వారా ఈ చిత్ర నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందని అన్నారు. విశాఖ ప్రజలు కొత్తవారి ప్రతిభను ఎల్లప్పుడూ ఆదరిస్తారన్నారు. చిత్ర కథానాయకుడు హర్ష మాట్లాడుతూ హీరో రవితేజ బ్యాగ్రౌండ్ లేకుండా ఎదిగిన హీరో అని కొనియాడారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ మూవీకి దీపక్ ఎరెగడ సినిమాటోగ్రఫీ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు కల్యాణ్ సంతోష్, నటి దివ్య శ్రీపాద, ఎడిటర్ కార్తీక్, ఆర్ట్ డైరెక్టర్ చంద్ర మౌళి, సినీ దర్శకులు రవికాంత్, సంగీత దర్శకుడు శ్రీ చరణ్, శ్రీకాంత్, శరణ్, నిర్మాతలు సుధీర్, నాయక్, డిసిపి విద్యాసాగర్ నాయుడు, వైసిపి నేత డి.శ్రీవాస్తవ, ప్రశాంత్ పాల్గొన్నారు.

షిప్‌యార్డులో కాంట్రాక్టర్ ఆగడాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)లో లీడ్ ఇంజినీరింగ్ కాంట్రాక్టరు మోసాలకు పాల్పడుతూ 82 మంది కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలివ్వకపోవడంతో కార్మికులంతా మంగళవారం ఆందోళనకు దిగారు. షిప్‌యార్డు గేటు వద్ద ఉదయం 11 గంటల సమయంలో కాంట్రాక్టరు తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం నగరంలోని లేబర్ డిపార్టుమెంట్ కార్యాలయానికి చేరుకుని తమ గోడు వెళ్లదీశారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని లేబర్ అధికారులు వీరిని కోరగా ఆ విధంగా కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేశారు. గడిచిన నాలుగు నెలలుగా జీతాలివ్వకుండా, 12 నెలల నుంచి తమ పిఎఫ్ డబ్బులు కట్టకుండా తమను వేధిస్తున్న సదరు కాంట్రాక్టరుపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లీడ్ ఇంజినీరింగ్ పేరుతో షిప్‌యార్డులో కాంట్రాక్టు దక్కించుకున్న ఆ ప్రైవేట్ వ్యక్తి చర్యలపై యాజమాన్యం స్పందించాలని, తమ జీతభత్యాలు చెల్లించాలని కోరారు. సమస్యపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కాంట్రాక్టర్ నోరుమెదపడం లేదంటూ కార్మికులు తీవ్రస్థాయిలో ఆవేదన చెందారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి వివిధ పథకాలు

ప్రజాశక్తి - రంపచోడవరం : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు చేసుకున్న మహిళలకు స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, పరిశ్రమల శాఖ ప్రాజెక్ట్ అధికారి పి.శ్రీనివాసరావు, వెలుగు ఏపీడి ఎ.శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎన్.రవితేజ మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ 7 మండలాలకు చెందిన 166 మంది మహిళలు దరఖాస్తులు సమర్పించారని, అర్హతలను బట్టి ఎంపిక చేసి 35శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పీఎంఈజీపి ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేసి సంబంధిత బ్యాంక్ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, యాంకర్ పర్సన్ రామరాజు, అన్ని మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా రంగాలకు రుణాలివ్వండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న వ్యవసాయ, ఎస్‌హెచ్‌జి బ్యాంక్ లింకేజ్, రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు, ఎపి టిడ్కో ఇళ్లు తదితర రంగాలకు లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలందించి జిల్లా ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున బ్యాంకర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రుణ ప్రణాళిక నాలుగో త్రైమాసికం అమలు, సాధించిన ప్రగతిపై బ్యాంకర్లతో డిసిసి / డిఎల్‌సిఆర్ సమావేశాన్ని జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి ఆయన నిర్వహించారు. ముందుగా గత త్రైమాసిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను, సాధించిన ప్రగతిని లీడ్ బ్యాంకు మేనేజర్ వి.శర్మ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం రుణ ప్రణాళికలో మార్చి 2023 నెలాఖరుకు రూ.70,769 కోట్లు పంపిణీతో 266 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రుణాల నిమిత్తం రూ.3,999 కోట్లు లక్షానికిగాను రూ.5,554 కోట్లతో 139 శాతం, ప్రాధాన్య రంగాలకు సంబంధించి రూ.13,758 కోట్ల లక్ష్యానికిగాను రూ.16,629 కోట్లు పంపిణీతో 121 శాతం, అప్రాధాన్యతా రంగాలకు రూ.12,876 కోట్ల లక్ష్యానికిగాను రూ.54,140 కోట్లుతో 420 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. ఎంఎస్‌ఎంఇ రంగానికి రూ.7,503 కోట్ల లక్ష్యానికిగాను రూ.10,072 కోట్లుతో 134 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ పథకాలను, రుణ వితరణలను కలెక్టర్ సమీక్షించారు. విశాఖ జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు తమ శాఖలను విస్తరించాలని ఆదేశించారు. జిల్లాలో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేసామని, వాటి పూర్తికి బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలని అన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎల్‌డిఎం విఎస్.శర్మ, ఆర్‌బిఐ ఎల్‌డిఒ పూర్ణిమ, నాబార్డ్ డిడిఎం సమంత్, ఎస్ఎల్‌బిసి చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, జివిఎంసి యుసిడి పీడీ పాపినాయుడు, వ్యవసాయ శాఖ అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో బ్యాంకర్లతో మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం జరిగే డ్రైడేలో క్షేత్రస్థాయిలో ఎఎన్‌ఎంలు, ఆశాలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లను భాగస్వాములు చేయాలన్నారు. రాబోయే నాలుగు నెలల్లో వారంలో ఐదు రోజులపాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, వసతి గృహాల్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

డెంగీ వ్యాధిగ్రస్తులకు పూర్తి చికిత్స అందజేసేందుకు సంసిద్ధంగా ఉండాలని కెజిహెచ్, ఏరియా ఆసుపత్రి, అగనంపూడి సిహెచ్‌సి, ఇతర ఆసుపత్రుల వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జగదీశ్వరరావు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, జిల్లా మలేరియా అధికారి తులసి, జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కుమార్, మున్సిపల్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థాయీ సంఘం బరిలో 20 మంది

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికల బరిలో 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థాయీ సంఘం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. నామినేషన్ వేసిన వారిలో శరగడం రాజశేఖర్, గంధం శ్రీనివాసరావు, గోడి విజయలక్ష్మి, పిసిని వరలక్ష్మి నరసింహం, బల్ల శ్రీనివాసరావు, పిల్లా మంగమ్మ, బొమ్మిడి రమణ, నొల్లి నూకరత్నం, ముక్కా శ్రావణి, ఉరుకూటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, అక్కరమాని పద్మ, గుడ్ల విజయ సాయి, బల్లా లక్ష్మణరావు, పీలా లక్ష్మీ సౌజన్య, భూపతిరాజు సుజాత, కంటిపాము కామేశ్వరి, బట్టు సూర్యకుమారి, చల్లా రజిని, మద్దెల రామలక్ష్మి ఉన్నారన్నారు. ఈ నెల 12న ఉదయం 11 గంటలకు నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుందని తెలిపారు. 15 మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, 19న ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు.

సీతామహాలక్ష్మికి ఉత్తమనటి బహుమతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పొలపల మల్లికార్జునరావు మెమోరియల్ ఫైన్ ఆర్ట్స్, వైఎస్ఆర్ కళా పరిషత్తు సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పరిషత్తు పోటీల్లో నగరానికి చెందిన 'జాస్మిన్ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్' ప్రదర్శించిన 'సంకల్పం' నాటికలో నటించిన అన్నపూర్ణ పాత్రధారిణి సీతామహాలక్ష్మికి ఉత్తమ నటి బహుమతి లభించింది. విశాఖ జిల్లా వాసి రావి నాగేశ్వరరావు రచించిన ఈ నాటికకు సంధ్యా ప్రియదర్శిని దర్శకత్వం వహించారు. దీంతో కలిపి సీతామహాలక్ష్మి ఇదే పాత్రకు రెండు సార్లు ఉత్తమ నటి, రెండు సార్లు ప్రత్యేక బహుమతులు దక్కినట్లైంది. ఈ సందర్భంగా ఆమెను రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, నగరానికి చెందిన పలువురు అభినందించారు.

23న ప్రజా సింహ గర్జనకు తరలిరండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను గద్దె దించి, బిసిలకు రాజ్యాధికారం వచ్చేలా త్వరలో నూతన పార్టీ ఆవిర్భావం జరగనున్నదని బిసి సంఘం జాతీయ నేత బోడె రామచంద్ర యాదవ్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో భారతీయ యాదవ మహాసభ అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొల్లి సన్నిబాబు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నూతన పార్టీ ఆవిర్భావ సన్నాహక సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 23న దళిత, బహుజన, రైతు, శ్రామిక, మైనారిటీ, వెనుకబడిన తరగతుల రాజ్యాధికారం కోసం ప్రజా సింహ గర్జన పేరిట భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. దీనికి గుంటూరు - విజయవాడ జాతీయ రహదారి సమీపంలోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న స్థలం వేదిక కానుందని అన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారని మండిపడ్డారు. సమావేశంలో భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నమ్మి అప్పలరాజు యాదవ్, బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిలాడి అప్పలరాజు పాల్గొన్నారు.

భారీ వాహనాలపై అదుపేదీ ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలో శర వేగంగా నిర్మాణ రంగం ముందుకు వెళ్తున్న ప్రాంతాల్లోకి వచ్చే ఎండాడ, సాగర్‌నగర్, వివేకానంద నగర్‌లలో భారీ వాహనాల రణగొణ ధ్వనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రీ, పగలూ పెద్ద ఎత్తున భారీ ట్రిప్పర్లు శరవేగంగా ఇసుక, మట్టి, ఇతర ఇనుప సామగ్రితో దూసుకెళ్తుండంతో బెంబేలెత్తుతున్నారు. ఉదయం నాలుగు గంటల నుంచే రోడ్లపై హల్‌చల్ చేయడంతో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఈ వాహనాల కారణంగా రోడ్లపై దుమ్ము ధూళి ఇళ్లలోకి చేరుతోంది. చిన్నా, పెద్దా అన్ని తరగతులవారికీ అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతోంది. ఈ నేపథ్యంలో భారీ ట్రిప్పర్లను నగరం, కాలనీల్లోకి జివిఎంసి అధికారులు ఎలా అనుమతిస్తున్నారంటూ జనం దుమ్మెత్తిపోస్తున్నారు. ఎండాడ పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి వీటిని అదుపు చేయాలని, అక్కడ ఇనుప రాడ్లతో ఒక స్టాండ్ ఏర్పాటు చేసి భారీ లారీలను (స్కూల్ బస్సులను మినహా) రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఇరుకు రోడ్డులో వెళ్తున్న భారీ వాహనం

అసలు కారణం ఏంటి ?

స్థానికంగా తలపెట్టిన ఓ ప్రాజెక్టు కోసం కొండ తవ్వకాలు ఇక్కడ సాగుతున్నాయి. భారీ అపార్టుమెంట్ల పనులూ జరుగుతున్నాయి. వీటి అవసరార్థం ఈ భారీ ట్రిప్పర్లు, వాహనాలు ఇష్టానుసారం తిరుగుతున్నాయి. వీటి రాకపోకలు అధికమవడంతో రోడ్డు అధ్వానంగా తయారై తారు రోడ్డు ఆనవాళ్లే లేకుండా పోయింది. జివిఎంసి అధికారులు సైతం సదరు వాహనాల అదుపునకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. బీచ్ రోడ్డు మార్గంలో ఈ తరహా భారీ ట్రిప్పర్లను అనుమతించాలని, ఇరుకైన సాగర్‌నగర్, వివేకానందనగర్, ఎండాడ రోడ్లపై అనుమతించకూడదని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. వివేకానందనగర్ పార్కు వద్ద షాపులకు వైసిపి నాయకులు అక్రమంగా అనుమతులు ఇవ్వడంతో ఇంకా ఈ రోడ్డు ఇరుకుగా మారింది. భారీ వాహనాలు వచ్చేటప్పుడు రద్దీ పెరిగిపోతోంది. ఇప్పటికైనా జివిఎంసి, రెవెన్యూ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.